కథ

**దీక్షితుల వాణీప్రభ**

# వధువు కావలెను

## వన్ ఫైన్ మార్నింగ్!

కూరగాయల కోసం రైతుబజార్‌కి వెళ్తూ మా అవధాని ఏం చేస్తున్నాడో చూద్దామని ఆ వీధిలోకి ఒక టర్నింగ్ ఇచ్చాను. అవధాని బాగానే ఉన్నాడు. కానీ నాకే ఆ టర్నింగ్‌లో నుంచి తిరిగి బయటపడడానికి తర్వాత్తర్వాత కొంచెం టైమ్ పట్టింది.

వెళ్తానే కాఫీ కప్పు చేతిలో పెట్టి ''అన్నగారూ- మా అబ్బాయికి సరిపోయే సంబంధం మీరే చూడాలి. ఈయనేం పట్టించుకోరూ- కాస్తంత మనిషి సాయం లేక పెళ్లి కుదరక నేను పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావనుకోండి'' అంటూ చెల్లెమ్మ ప్రాధేయపడడంతో తెగ ఫీలయిపోయి ''ఓస్! అంతే కదా- నీకే అవసరమొచ్చినా జస్ట్ రింగ్ ఇస్తే చాలు- నేను వస్తాను'' అంటూ ప్రామిస్సయితే చేసేశాను కానీ అదంత ప్రమాదకరం అని అస్సలూహించలేదు.

మా అవధాని...అంటే నాకు మంచి స్నేహితుడు. తనకి నాలుగు అక్షరం ముక్కలబ్బి ఆఫీసర్ అయితే, నా అదృష్టం బాగుండి నేను యు.డి.సి.గానే మిగిలిపోయాను. లేకపోతే వాడిలాగే ఉన్న ఒక్కగానొక్క పుత్రరత్నానికి దగ్గరుండి పెళ్లి చేసుకోలేని అయోమయ అధ్వాన్న స్థితిలో తగలబడుదును.

ఆఫీసూ, ఫైళ్లూ తప్ప మరో లోకం లేదు వాడికి. రోమ్ తగలబడుతోంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తిలాగా ప్రపంచంతో సంబంధం లేనంతగా వాడి ఫైల్లే లోకం- పాతాళభైరవి, మల్లీశ్వరి తరువాత మంచి సినిమాలు ఉన్నాయంటే మరి నమ్మడు. నాగార్జునంటే నాగేశ్వర్రావు కొడుకనీ, వెంకటేషంటే రామానాయుడి కొడుకనే వాడు ఐడెంటిఫై చెయ్యగలడు. ఎందుకంటే వాడి జీవితం యవ్వనం దగ్గరే ఆగిపోయి తర్వాత ఆఫీసులో మొదలయింది. వాడికి బాగా తెలిసిన మాటలు రెండే. ఆవిడేం చెప్పినా 'నీ ఇష్టం', 'నీకు తోచినట్లు చెయ్యి'- ఆ ఆఫీసు జీవితో పెళ్లి గురించి చర్చించి చర్చించి చివరికి విసిగి వేసారిన మా చెల్లెమ్మ తనే స్వయంగా రంగంలోకి దిగింది. నన్ను ఊతంగా పట్టుకుని మరీ- ఇంక నాకు అక్కడి నుంచి ప్రతి ఆదివారం ఒకటే హడావుడి. ''అన్నా! ఆదివారం అమలాపురంలో 'ఆంధ్ర అఖిల కుల వివాహ వేదిక' ఉంది- వెళ్దామా!'' అని శనివారం రింగూ...

ఆదివారం ఉదయమే టాక్సీ మాట్లాడుకుని అమలాపురం బయల్దేరాము. మా అబ్బాయి ఇంకా ఇంటర్ చదువుతూ ఉండడంతో నాకు ఈ సమస్యలు లేవు- పిచ్చాపాటీగా మాట్లాడుతూ చెల్లెమ్మ తన సమస్యని ఏకరువు పెట్టింది.

మా అవధాని కొడుకు చెన్నైలో టాటా కన్సల్టెన్సీలో లక్ష రూపాయల జీతగాడు. ఇంకా పెళ్లంటే కాలేదు కానీ రెండేళ్ల క్రితమే ఓ ఇంటి వాడయ్యాడు. అంటే ఇంటికి ఓనరయ్యాడు. అందంలో మన్మధుడు కాకపోయినా హాలీవుడ్ మోడల్‌గా బాడీబిల్డరూ. ఓ జెంట్స్ బ్యూటీపార్లర్‌లో పర్మనెంట్ కస్టమరూనూ.. మరి కోరికలూ దానికి తగినట్టే- అమ్మాయికి ఉద్యోగం ప్రధమార్హత. నీకుంది కదరా లక్ష రూపాయల జీతం అంటే మరో లక్ష వస్తే అజీర్తి చేస్తుందా అంటాడు. అమ్మాయి తెల్లగా ఉండాలి, అందంగా ఉండాలి- తనకి తగినంత పొడుగుండాలి. జడ పొందిగ్గా బాగుండాలి. కాళ్లు పొట్టిగా ఉండాలి. పాదాలు చిన్నవిగా ఉండాలి. టెక్నికల్‌గా కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో కోర్సులు చేసి ఉండాలి. అమ్మాయి నేటివ్ పల్లెటూరైతే వద్దు. బైతుల బుద్ధులు ఎంత చదివినా పోవు. అమ్మాయి సోషల్‌గా, ఏక్టివ్‌గా ఉండాలి. ఈ అంతులేని గొంతెమ్మ కోరికల జాబితా అలా అలా పెరిగిపోతూ ఈవాళ వాళ్లమ్మ పీకకి చుట్టుకుంది.

కంప్యూటర్ కొనిచ్చి, ఇంటర్నెట్ కనెక్షన్ పెట్టించినందుకు వాళ్లమ్మ రోజూ ఈ-మెయిల్‌లో ఆడపిల్లల డిటైల్స్ పంపుతుండఢమూ, రకరకాల డాట్‌కామ్‌ల్లో చొచ్చుకుపోయి అమ్మాయిల ఫోటోలు చూడడమూ, నాకే నచ్చలేదు వాడికేం నచ్చుతాయని పెదవి విరవడమూ మామూలైపోయింది.

ఇవన్నీ విన్నాక తెర వెనుక చాలా తతంగం జరుగుతోందన్నమాట అనుకున్నాను. ఈలోగా అమలాపురం రానే వచ్చింది. టాక్సీ దిగగానే అక్కడి ఏర్పాట్లు చూసి నేను తెల్లమొహం వేస్తే, కొంచెం అలవాటైనట్లుంది మా చెల్లెమ్మ ముందుకి దూసుకుపోయింది.

తెలుగుదేశం పార్టీ వారి మహానాడు. కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలకి కూడా ఇంత హంగామా, ఎన్ని బస్సులు, లారీల్లో లాక్కొచ్చినా ఇంత జనం ఉంటారని ఎవ్వరూ ఊహించరు- పెద్ద గ్రౌండ్‌లో పది, పదిహేను షామియానాలు వేసి ఉన్నాయి. ప్రతీదానికీ ఒక బోర్డు- కులాల వారీ ఐక్యవేదికలన్నమాట... స్టేజి, కుర్చీలూ, స్టేజ్ మీద స్క్రీన్, ప్రొజెక్టరూ చాలా హడావుడిగా ఉంది. కృష్ణుడికి రివర్స్‌లో అర్జునుడు రథసారధ్యం వహించినట్లు చెల్లెమ్మ నన్ను బ్రాహ్మణ ఐక్యవేదిక షామియానాలోకి లాక్కుపోయింది. ఇంక రెండు కుర్చీలు చూసుకుని కూలబడదాం అనుకుంటూ ఉండగా ''అయ్యో! అన్నయ్యా- ఇంతదూరం వచ్చింది కూర్చోవడానికా.. రండి- రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి'' అంటూ ఆఫీస్ అన్న షామియానాలోకి దారితీసింది. ''రిజిస్ట్రేషన్ ఫీజు 300 రూపాయలు, బయోడేటా, ఫోటో అన్నీ ఇచ్చాక మీ నంబరు 20, అది వచ్చేవరకూ వెయిట్ చెయ్యాలి. భోజనం కావాలంటే చెరో వంద కట్టి కూపన్ కొనుక్కోండి'' అని సజెషన్స్ ఇచ్చాడు క్లర్క్. స్క్రీన్ మీద ఫోటోలు చూపిస్తున్నారు. ముందు అమ్మాయిలవి తర్వాత అబ్బాయిలవిట.. దానితోపాటే వెనకాల మైకులో ఆ అమ్మాయి వివరాలు కూడా చెప్తున్నాడు. ఎవరైనా ఇంటరెస్ట్ ఉన్నవాళ్లకి ప్రత్యేకంగా మాట్లాడుకోవడానికి ఒక రూమూ, జాతకాలు, నక్షత్రాలు విషయంలో డౌట్స్ క్లారిఫై చెయ్యడానికి పండితులూ అన్నీ రెడీగా ఉన్నాయి.

వెల్ ప్లాన్‌డ్!

కానీ నాకు ఎందుకో సడెన్‌గా చిన్నప్పుడు ఒకసారి మా పాలేరుతో వెళ్లి చూసిన మండపేట గేదెల సంత గుర్తుకొచ్చింది. అక్కడ కూడా ఇలాగే జాతిని బట్టి వేరువేరుగా గేదెలు, ఎద్దులు, ఆవులు





కట్టేస్తారు. గేదె దగ్గరకి వెళ్లి చూడగానే బ్రోకరు వచ్చి దాని గుణవిశేషాలు వివరంగా చెప్తాడు. నచ్చితే ఎడ్వాన్సు పుచ్చుకుని ఇంటికి జేరవేసే బాధ్యత కూడా అతనే తీసుకుంటాడు.

చాలామంది అక్కడే ఉన్న అమ్మాయిలు, అబ్బాయిలు ఒకరితో ఒకరు పర్సనల్‌గా మాట్లాడేందుకు అనుమతి కోరుతున్నారు. వాళ్లలో చాలామంది ఎటువంటి సున్నితమైన భావాలూ ప్రకటించకుండా చాలా ప్రాక్టికల్‌గా మాట్లాడడం అదీ కూడా జాబ్, డ్యూటీ టైమింగ్స్, సాలరీ, సేవింగ్ గురించి కావడం నాకు చాలా విచారం కలిగించింది.

ఇంతలో ఏదో కలకలం- ఏమిటా అని చూస్తే ఒక కుర్రవాడు మరో అమ్మాయిని ''నాలుగేళ్లుగా జాబ్ చేస్తున్నావు. జీతమంతా మీ అమ్మానాన్నలకి పెట్టేసావా?'' అని అడిగాడుట. ఆ అమ్మాయి లెంపకాయ కొట్టి ''బ్రూట్!. ఎంత చదివినా మీ మేల్ ఇగో మాత్రం చావదురా'' అని తిట్టింది కూడానట! ఇరువైపుల పెద్దవాళ్లూ అటు ఏడుతరాలు, ఇటు ఏడుతరాలు ఏకరువు పెట్టుకుంటున్నారు. ఆ అమ్మాయిని పర్సనల్‌గా అభినందిద్దామంటే కుదరలేదు.

మా అనసూయ మాత్రం కన్నార్పకుండా అమ్మాయిల ఫోటోలూ, వివరాలూ చూస్తూనే ఉంది. ఇంతలో ఆర్తీఅగర్వాల్‌లా ముద్దుగా బొద్దుగా ఉన్న ఒక అమ్మాయి, డిటైల్స్ అన్నీ నచ్చాయి తనకీ నాకూ- ఆ అమ్మాయిని వెతుక్కుంటూ ఆ సీటు దగ్గరికి వెళ్లాం. తల్లీ తండ్రీ నల్లగా ఉన్నా అమ్మాయి మాత్రం కళగానే ఉంది. ఆ అమ్మాయి స్టడీస్, జాబ్ అన్నీ హైదరాబాద్‌లోనే. రెండు నిముషాలు మాట్లాడాక తనే సూటిగా ఒక ప్రశ్న వేసింది. ''ఆంటీ! నేను రెండునెలల తర్వాత ఇంగ్లాండ్ వెళ్తున్నాను.

మీ అబ్బాయి ఉద్దేశ్యం ఎలా ఉంది! ఒక్కసారైనా ఫారిన్ టూర్ చేసాడా- ఫారిన్‌లో సెటిలవ్వడం ఇష్టమేనా?'' అంటూ.

''అయ్యో!- ఉన్న ఒక్క కొడుకు ఫారిన్ వెళ్లిపోతే మేమేం చెయ్యాలి తల్లీ!'' అంది అప్రయత్నంగా అనసూయ.


''అయితే మీరు వేరే చూసుకోండి ఆంటీ- నేను ఫారిన్‌లో సెటిలవ్వాలని అనుకుంటున్నాను'' అని ఫ్రాంక్‌గా చెప్పిన ఆ అమ్మాయిని చూసి మతిపోయింది. మరి కాసేపాగి మరో అమ్మాయిని చూసి మాట్లాడాము. తండ్రి రైల్వేలో ఎంప్లాయీ- వాళ్లు బాగానే మాట్లాడారు. ఇందాకటి అమ్మాయి ఫారిన్ గురించి అడిగిందికదాని అనసూయ ''ఫారిన్ వెళ్లే ఉద్దేశ్యం ఏమైనా ఉందామ్మా'' అని అడిగింది. ఆ అమ్మాయి వెంటనే ''నేను, మా అమ్మానాన్నలకి ఒక్కర్తే కూతుర్ని. వాళ్లని వదిలి ఎక్కడికీ వెళ్లే ప్రసక్తి లేదు. పెళ్లయినా, నేను నా పేరెంట్స్ దగ్గరే ఉంటాను. నచ్చకపోతే మీరు వేరే చూసుకోండి'' అనడంతో వెర్రి మొహాలేసుకుని అనసూయ, నేను లేచి చక్కా వచ్చాము.

ఆ రోజుకి రిజిస్ట్రేషన్ ఫీజు, టాక్సీ, భోజనాల ఖర్చు కలిపి వెయ్యికి తక్కువ కాలేదు. పని మాత్రం పిసరంత కూడా ముందుకీ వెనక్కీ జరగలేదు. ఆ తర్వాత తనతోపాటు ప్రతీ ఐక్యవేదికకీ, జాబ్ మేళాలాగా ఈ వధూవరుల మేళాలకి అటెండవ్వడం నాకు పరిపాటి అయింది.

బాగా చదువుకున్నా పల్లెటూరి పిల్ల వద్దని వాడూ, బాగా చదువుకున్న పట్నం పిల్లలు ఇంతోటి ప్రొఫైలేకి మేం కావాలా అని వాళ్లూ- కొన్ని జాతకాలు నచ్చలేదని, కొన్ని ఫోటోలు నచ్చలేదనీ.. పెళ్లి కుదరడం ఇంత కష్టమా! అన్పించింది. అలా కాలచక్రంలో ఒక ఏడాది గిర్రున తిరిగింది.

మొత్తం మీద మరో ఫైన్ ఈవెనింగ్.. మా ఆవిడ వేస్తున్న వేడి వేడి దోశలని కొత్తిమీర పచ్చడిని టీవీ న్యూస్‌తో నంజుకుంటూ ఉండగా అనసూయ దగ్గరనుంచి ఫోన్. ''అన్నయ్యా! ఉన్నపళంగా ఒకసారి రండి'' అని-

అవధాని ఇల్లు మా ఇంటికి జస్ట్ రెండు వీధుల ముందే- తీరా నేను బైక్ దిగేసరికి మూడో అంతస్తులో ఉంటున్న అనసూయ గోడ దగ్గరే




ఆనుకుని నిలబడడం, అవధాని వెనక్కి లాగుతుండడం చూసి భయం వేసి మూడంతస్తుల మెట్లు ఒక్క సెకన్లో ఎక్కేసి ఆయాసంతో మాటలు తడబడుతూ ఉండగా ''అనసూయా- అంతపని మాత్రం చెయ్యకు- నీకు మేమందరం లేమా!'' అన్నాను.

''మిమ్మల్ని నమ్ముకున్నందుకే కదా అన్నయ్యగారూ- దగ్గరనుంచి చూస్తారని వెంటనే పిలిచాను'' అంది.

ఆవిడ నమ్మకానికి కళ్లు జలపాతాలై ''నేను శెలవు పెట్టైనా నీ పని జరిగేలా చూస్తాను తప్ప నువ్వింత పని చెయ్యకమ్మా- నా కళ్లతో నేను చూడలేను'' అని గద్గద స్వరంతో అంటుంటే అనసూయ ఖంగుతిని-

''అన్నయ్యా! మీరేం మాట్లాడుతున్నారు? ఆ క్రింది వాటాలో మొక్కలకి నీళ్లు పెడుతున్న అమ్మాయిని చూడండి- ఆ అమ్మాయిని చూపిద్దామనే పిలిచాను'' అంది. అయితే గోడ దగ్గర తచ్చాడుతున్నది దూకడానికి కాదు, అమ్మాయిని చూడడానికన్నమాట- హమ్మయ్య అని సర్దుకుని క్రిందికి దృష్టి సారించాను.

మొక్కలకి ట్యూబ్‌తో నీళ్లు పెడుతున్న ఆ అమ్మాయి నిజంగానే బాగుంది. చెల్లెమ్మ చెప్పుకుపోతోంది. ఐక్యవేదికలూ, వధూవరుల మేళాలూ తిరిగే హడావుడిలో కంటికి ఎదురుగానే కోడలు ఉన్నా ఇన్నాళ్లు గుర్తించలేదుట. ఆ పిల్ల ఎంసిఏ చేసి విప్రోలో పనిచేస్తుందిట- సాంప్రదాయిక కుటుంబం. ప్రొఫైల్, నక్షత్రం, జాతకం అన్నీ నప్పాయి.

ఇంకేముంది? నెలరోజుల్లో అవధానిగాడింట్లో సన్నాయి మోగింది. ఆ మర్నాడే నేనూ అమలాపురంలో ఐక్యవేదికకి హాజరయ్యాను, మా అబ్బాయి పేరు రిజిస్టర్ చెయ్యిద్దామని... ఎందుకంటే ఇప్పుడు ఇంటరే కానీ అయిదేళ్లకైనా పెళ్లి కుదరకపోతుందా అని నా ఆశ.

☆

## పాపం శిల్ప!

**సినిమాల్లో చెంప ఛెళ్లుమనిపించే సీన్లు చేయడం చాలా కష్టమే అని శిల్పాశెట్టి అంటుంది. ఇటీవల ఓ చిత్రానికిగాను శిల్పాశెట్టి- సుధాంషు పాండె అనే నటుడి చెంప ఛెళ్లుమనిపించాలి. ఎన్ని టేకులు తిన్నా సరిగ్గా చెంప మీద కొట్టలేకపోయిందిట శిల్ప. ఇక లాభం లేదనుకుని ఆ సినిమా హీరో కమ్ కో డైరెక్టర్ అయిన సన్నీ డియోల్ ఎంతో చెప్పిన మీదట సుధాంషు చెంపని పేలగొట్టిందిట. షాట్ సూపర్ అన్నాడు దర్శకుడు. కానీ శిల్పా మాత్రం తెగ వర్రీ అయిపోయి సుధాంషుకి క్షమాపణలు చెప్పుకుందిట. పర్వాలేదని అతను అన్నా కూడా ఆ మర్నాడు బొకే ఇచ్చి అతనింటికి పంపించి తిరిగి క్షమాపణలు కోరిందిట. అంత సెంటిమెంటల్ మనిషిట శిల్ప.**

